క్లుప్తంగా

జట్ల కొండూరులో కాకాణి ప్రచారం నేడు

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు, బండేపల్లి, కుడితిపల్లి గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు వెందోటి భాస్కర్‌రెడ్డి, ఆవుల తులసీరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రచారం ప్రారంభమవుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాబా మందిరానికి రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరానికి తన్నీరు సుందర్‌రాజా కుటుంబ సభ్యులు రూ.2,00,116 నగదును శుక్రవారం మందిర సేవా సమితి సొసైటీ బాధ్యులకు అందజేశారు. అన్నదానానికి వినియోగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దాత సుందర్‌రాజాకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చీమకుర్తి రాజగోపాల్, తరుగు ప్రభాకర్, సుబ్బానాయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

• సీఐ రాంబాబు



బీఎస్‌ఎఫ్ జవాన్లతో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్సై

పొదలకూరు: ఎన్నికల నిర్వహణకు ప్రజలంతా పూర్తి సహకారం అందించాలని సీఐ ఆర్.రాంబాబు కోరారు. పట్టణంలోని సంగం రోడ్డు సెంటర్ నుంచి గేటు సెంటర్ వరకు మండలంలోని చాటగొట్ల గ్రామంలో శుక్రవారం సాయుధ (బీఎస్‌ఎఫ్) బలగాలు, ఎస్సై రామకృష్ణతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటును స్వేచ్ఛాయుత వాతావరణంలో వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. అల్లర్లు సృష్టించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బీఎస్‌ఎఫ్ జవాన్లతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ఓటర్లకు భరోసా కల్పించారు.

ఆశాజనకంగా ధాన్యం ధరలు



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సుజాత

కొడవలూరు: ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నాయని కోవూరు ఏడీఏ డి.సుజాత స్పష్టం చేశారు. మండలంలోని కమ్మపాళెంలో ధాన్యం విక్రయిస్తున్న రైతుల వద్దకు శుక్రవారం ఆమె వెళ్లి ధరలను ఆరా తీశారు. ఏ గ్రేడ్ రకాలైన బీపీటీ 5202ను పుట్టి రూ.22,000 నుంచి రూ.22,500కు, కేఎన్‌ఎం 1638ను పుట్టి రూ.21 వేలకు విక్రయిస్తున్నట్లు అన్నదాతలు తెలిపారు. దిగుబడి బాగున్నట్లు వెల్లడించారు. ఏడీఏ వెంట ఏఈఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి, వీఏఏలు ఒ.సుజిత్, జి.ఉమామహేష్ ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



సలీం



స్టాలిన్‌బాబు

కోవూరు: కోవూరు బార్ అసోషియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే సలీంబాషా, పూండ్ల స్టాలిన్‌బాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోషియేషన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సలీంబాషా తన ప్రత్యర్థి చెన్నయ్యపై, స్టాలిన్‌బాబు చిట్టేటి చంద్రమోహన్‌పై గెలుపొందారు. వారికి పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఇఫ్తార్ విందు

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి శుక్రవారం రాత్రి పెద్ద మసీదులో ఇఫ్తార్ విందు ఇచ్చారు. పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సుమారు 450 మందికిపైగా ముస్లింలు విందును స్వీకరించారు.

మంచి చేశాం.. ఆశీర్వదించండి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
• పూడిపర్తి, ఎగువమిట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



మంత్రి కాకాణికి హారతి ఇస్తున్న మహిళ

వెంకటాచలం: 'ఐదు సంవత్సరాల్లో ప్రజలందరికీ మంచి చేశాం. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని పూడిపర్తి, ఎగువమిట్ట గ్రామాల్లో శుక్రవారం కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పల్లెలకు విచ్చేసిన గోవర్ధన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి మళ్లీ సర్వేపల్లిలో మీరే విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాకాణి పలు కాలనీల్లో ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాల ద్వారా జరిగిన మేలు, గ్రామాల్లో అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు నాయుడు, జగన్‌మోహన్‌రెడ్డి పాలన మధ్య తేడా గురించి ప్రజల చేత చెప్పించారు. సర్వేపల్లి నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎవరూ చేయనన్ని పనులను ఐదేళ్లలో చేసి చూపించానన్నారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేశానన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్న పాలనకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, జిల్లా నాయకులు కమలాకర్‌రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బి.రామకృష్ణారెడ్డి, పి.శ్రీనివాసులురెడ్డి, డి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

అంకుపల్లిలో తెలుగుదేశానికి షాక్



గోవర్ధన్‌రెడ్డితో అంకుపల్లి కార్యకర్తలు

పొదలకూరు: మండలంలోని అంకుపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు అనెం మస్తానయ్య తన అనుచరులతో కలిసి గురువారం రాత్రి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో ఆ ఊరిలో టీడీపీకి షాక్ తగిలినట్టయ్యింది. చాలా ఏళ్లుగా అంకుపల్లిలో మస్తానయ్య టీడీపీలో కొనసాగుతున్నారు. ఆయనతోపాటు 20 కుటుంబాల వారు మంత్రిని నెల్లూరు క్యాంప్ కార్యాలయంలో కలిసి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకొన్నారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ టీడీపీ పనైపోయిందన్నారు. సుదీర్ఘ కాలం ఆ పార్టీలో ఉన్న నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనెం పెంచలయ్య, కాసరం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన చిట్టమూరి శేషారెడ్డి



కాకాణితో శేషారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: మండలంలో టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడైన చిట్టమూరి శేషారెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలోని అనికేపల్లి గ్రామానికి చెందిన శేషారెడ్డి గుర్తింపు ఉన్న నాయకుడు. అయితే సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకించి టీడీపీకి గుడ్‌బై చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని శుక్రవారం తన కార్యాలయంలో కలిశారు. దీంతో కాకాణి శేషారెడ్డితోపాటు అదే గ్రామానికి చెందిన మరో నాయకుడు మేనకూరు విష్ణువర్ధన్‌రెడ్డికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గ్రామాల్లో ప్రచారం



ఇందుకూరుపేట మండలంలో..



కోవూరులో..



కోవూరులో కరపత్రం అందజేస్తూ..

ఇందుకూరుపేట: వైఎస్సార్‌సీపీ నుంచి నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా బరిలో ఉన్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని నిడిముసలి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి కోరారు. మండలంలోని నిడిముసలి గ్రామంలో శుక్రవారం ఆయన గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిందచిన పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా మీ కుటుంబానికి మేలు జరిగి ఉంటేనే ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నరసమ్మ, శ్రీనివాసులు, రాజేష్, వెంకయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

• కోవూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఆ పార్టీ యువజన విభాగం నాయకులు కోరారు. శుక్రవారం మండలంలోని కోవూరు, వేగూరు, పెళ్లకూరు కాలనీ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన పోరాటం చేస్తున్నారన్నారు. వారికి అండగా ఉండాలని కోరారు. చిరంజీవి, సుబ్బారెడ్డి, ఎంపీటీసీ వేణుగోపాల్, రమేష్, అంజనరావు, మాల్యాద్రి, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీ నోరు అదుపులో పెట్టుకో..



మాట్లాడుతున్న యువజన విభాగం నాయకులు

కోవూరు: కిర్రాక్ ఆర్పీ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు పులి శ్రీనివాసులు యాదవ్, అనూప్ రెడ్డి, వెంకట రమణారెడ్డి, గయజ్ హితవు పలికారు. శుక్రవారం కోవూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై ఆర్పీ ఇష్టానుసారం మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. నల్లపరెడ్డి కుటుంబం దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉందన్నారు. శ్రీనివాసులురెడ్డి, ప్రసన్న ఎన్నోసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారన్నారు. రాష్ట్రంలో ఏ మూలకి వెళ్లిన నల్లపరెడ్ల మంచితనం గురించి చెబుతారన్నారు. లోకేసాయి, గిరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి త్యాగరాజ స్మరణోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవాలను శనివారం నుంచి ఏప్రిల్ ఐదో తేదీ వరకు నిర్వహించనున్నామని త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రికలను పురమందిరంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఫాల్గుణ బహుళ పంచమిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరం నుంచి సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత త్యాగరాజ ఉత్సవమూర్తులు, చిత్రపటాన్ని పురమందిరం వరకు ఊరేగింపుగా శనివారం తీసుకురానున్నామని వివరించారు. స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ, కలశస్థాపన, పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టనున్నామని చెప్పారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో సంగీత కచేరీలను రోజూ నిర్వహించనున్నామని వివరించారు. కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు. స్మరణోత్సవ సభ కమిటీ ఉపాధ్యక్షుడు అన్నవరం సత్యనారాయణ, అవధానం రామ్‌ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జునరావు, సహాయ కార్యదర్శి పామర్తి బలరామ్, సభ్యులు మాధవరావు, శ్రీరామగిరి హనుమంతరావు, వెంకటేశ్వర్లు, యద్దనపూడి ధనుంజయ, కమల, దుర్గా జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

జేసీ పరిశీలన



కోవూరు: తెలంగాణ రాష్ట్రంలో జాయింట్ కలెక్టర్ పనిచేస్తున్న పచ్చిపాల రాజా విక్రమ్‌రెడ్డి కోవూరుకు విచ్చేశారు. స్థానిక పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఇటీవల పచ్చిపాల రామనాథమ్మ ట్రస్ట్ నిర్మించిన సరస్వతీదేవి మందిరాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు.

రైతులకు సూచనలు



కోవూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న వరి కోతలను శుక్రవారం సహాయ వ్యవసాయ సంచాలకురాలు సుజాత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బీపీటీ 5204 దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఇందిరావతి, వీఏఏ చైతన్య, రైతులు ఎస్.రామ్మూర్తి, వి.మల్లికార్జున్‌రెడ్డి, మురళి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పతాకావిష్కరణ

నెల్లూరు(బృందావనం): విరాట్‌నగర్‌లోని వీబీఎస్ కల్యాణ మండప ప్రాంగణంలో పంచ వృత్తుల పతాకాన్ని నెల్లూరు పట్టణ విశ్వ బ్రాహ్మణ సేవా సంఘ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. సంఘ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని తొలుత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో గాయత్రి అమ్మవారు, విశ్వకర్మ భగవాన్, గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు చేశారు. సంఘ శాశ్వత గౌరవాధ్యక్షుడు కందుకూరు చెంగయ్య ఆచారి, నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, ఇందుకూరు రమేష్, దండపాణి సురేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆదాలను గెలిపించాలంటూ..

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని అర్హులకు సంక్షేమ పథకాలు అందాయని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయనున్న తన తండ్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని హిమబిందు కోరారు. 36వ డివిజన్లో శుక్రవారం నిర్వహించిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, పార్టీ విజయం తథ్యమనే అంశం దీని ద్వారా స్పష్టమవుతోందని చెప్పారు. కార్పొరేటర్ పిండి శాంతిశ్రీ, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి పిండి సురేష్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెస్సెమ్‌ఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో-ఆర్డినేటర్ లక్ష్మీసునంద, క్లస్టర్ - 1 అధ్యక్షుడు ముడియాల రామిరెడ్డి, దారా వంశీ, పఠాన్ అస్లామ్‌ఖాన్, కొండేటి శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాబ్జీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

నెల్లూరు(దర్గామిట్ట): నగర నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర అధికారి ప్రతినిధి ప్రసాద్ ప్రశ్నించారు. మాగుంట లేఅవుట్లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ పదవిని పొంది మంత్రి హోదాను అనుభవించినా, నగరాన్ని నారాయణ తూతూమంత్రంగా అభివృద్ధి చేశారని విమర్శించారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిపై మాట్లాడే స్థాయి రూప్‌కుమార్ యాదవ్‌కు లేదని చెప్పారు. సర్వేపల్లి కాలువ అభివృద్ధితోపాటు కోట్లాది రూపాయలతో నగరంలో అభివృద్ధి పనులను అనిల్ చేపట్టారని గుర్తు చేశారు.

భక్తిశ్రద్ధలతో..



కొడవలూరు: చంద్రశేఖరపురంలో శిలువ మోస్తూ..

కొడవలూరు: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చంద్రశేఖరపురంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చి ఆధ్వర్యంలో ఓ వ్యక్తి శిలువను మోశారు. తొలుత చర్చిలో ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్‌లు ఎ.కృష్ణారావు, శైలజ సందేశాన్నిచ్చారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని, ఇతరులకు సాయపడే స్వభావం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సండే స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.

• మనుబోలు: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని గురివిందపూడిలోని పెనుయేలు ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మనుబోలు దళితవాడ, కోదండరామపురం, కాగితాలపూరు, చెర్లోపల్లి, పిడూరు, అక్కంపేట, బద్దెవోలు, కట్టువపల్లి, కొలనకుదురు తదితర గ్రామాల్లోని చర్చిల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

సోమిరెడ్డిపై టీడీపీ నేతలకే నమ్మకం లేదు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



జగదీష్



వైఎస్సార్‌సీపీలో చేరిన తోటపల్లిగూడూరు పంచాయతీ వారితో కాకాణి

తోటపల్లిగూడూరు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై టీడీపీ నేతలకే నమ్మకం లేదని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తోటపల్లి గూడూరు గ్రామానికి చెందిన 30 టీడీపీ కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంత్రి కాకాణి తన నివాసంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సోమిరెడ్డికి మరో ఓటమితో ఘనంగా వీడ్కోలు పలికేందుకు సర్వేపల్లి ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం చిరంజీవుల గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, నాయకుడు అన్నం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

• వరిగొండ పంచాయతీ రావూరువారికండ్రిగకు చెందిన నేత జానా జగదీష్ శుక్రవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకొన్నారు. రెండు రోజుల క్రితం అతను తన అనుచరులతో టీడీపీలో చేరారు. అయితే అక్కడ ఇమడలేక గుడ్‌బై చెప్పేశారు. కాకాణి నివాసానికి చేరుకుని వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, నేతలు ఏపూరు కృష్ణ, ఉప్పల చరణ్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే గెలిపిస్తాయి



కరపత్రం అందజేస్తున్న పూజిత

పొదలకూరు: ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తన తండ్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని పూజిత వెల్లడించారు. శుక్రవారం ఆమె పట్టణంలో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. పొదలకూరు నాలుగు సచివాలయాల పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.173.22 కోట్లు వెచ్చించినట్లు పూజిత తెలిపారు. పొదలకూరులో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులను కాకాణి చేపట్టినట్టు పేర్కొన్నారు. అన్ని రంగాల్లో పట్టణాన్ని ముందంజలో ఉంచిన తమకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ జి.లక్ష్మీకల్యాణి, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు మూలి సతీష్‌కుమార్‌రెడ్డి, అంజాద్, హేమంత్, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, నాయకులు జి.వేణుగోపాల్‌రెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, ఎం.శేఖర్‌బాబు, డి.విజయభాస్కర్‌రెడ్డి, ఎల్.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడి కొత్తగా..



గురుకుల పాఠశాల భవనం

ముత్తుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదుల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మనబడి నాడు - నేడు పథకం, నాబార్డు నిధుల ద్వారా పెద్దఎత్తున భవనాలు, అదనపు గదుల నిర్మాణం చేపట్టింది. చాలాచోట్ల పూర్తవడంతో బడులు కొత్త రూపు సంతరించుకున్నాయి. ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్లో నాబార్డు నిధులు రూ.1.92 కోట్లతో అదనపు గదుల నిర్మాణం ఆఖరి దశకు చేరింది. ఇదే విధంగా నాడు - నేడు నిధులు రూ.1.92 కోట్లతో చేపట్టిన కొత్త భవన నిర్మాణం పూర్తయ్యింది. మరోవైపు బాలయోగి గురుకుల పాఠశాలలో నాబార్డు నిధులు రూ.1.43 కోట్లతో సర్వాంగ సుందరంగా భవనాన్ని నిర్మించారు.



ముత్తుకూరు హైస్కూల్‌లో నిర్మాణం పూర్తయిన భవనం

సమస్యలను పరిష్కరించాలని ఆదేశం

నెల్లూరు(బారకాసు): నగరంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గల మానిటరింగ్ విభాగాన్ని శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి.. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను స్క్రీన్ల ద్వారా గుర్తించాలని కోరారు. వీటిని సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని స్పష్టం చేశారు.

పరామర్శ

కలిగిరి: మండలంలోని తూర్పుదూబగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత గణేశం మీరారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మీరారెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.